# ప్రమాణాలు ముఖ్యం!

– డి. కృష్ణమూర్తి

ప్రశ్నల పద్ధతిలో తాజా మార్పుల ఉద్దేశం... ప్రతిభ గల విద్యార్థులకు అవకాశం కల్పించడమే అయితే మంచిది. ప్రతిభ అంటే విషయ పరిజ్ఞానం, అవగాహన, సబ్జెక్టును వాస్తవ పరిస్థితులకు వర్తింపచేయడం. బట్టీపట్టడం కాదు. ఎన్ని సీట్లు, ఎన్ని కాలేజీలున్నా ప్రతిభ గల విద్యార్థికి మంచి కాలేజీలో కోరుకున్న విభాగంలో సీటు లభించే విధంగా ఎంసెట్ స్థాయిని పెంచాలి.



ఇంటర్ సిలబస్ బోధించడంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతోనే ప్రశ్నపత్రం తయారుచేయించాలి. ప్రశ్నల సంఖ్యను కూడా 100-125కు తగ్గించి స్థాయిని పెంచాలి. కనీసం 50 శాతం ప్రశ్నలు క్లిష్టంగా ఉండేటట్లు ఇవ్వాలి. ప్రశ్నలడిగే పద్ధతిలో తాజా మార్పులు ప్రమాణాలను పెంచేవిధంగానే ఉన్నాయి.

## ఎలాంటి ప్రశ్నలున్నాయనేది ముఖ్యం!

ఎన్ని ప్రశ్నలున్నాయనేదానికంటే ఎలాంటి ప్రశ్నలున్నాయనేది ముఖ్యం. ఐఐటీ స్క్రీనింగ్ పరీక్షలో మొత్తం 90 ప్రశ్నలకు మించకుండా ఉంటాయి. దానికీ సమయం 3 గంటలే. కాక పోతే అడిగే ప్రశ్నలు విద్యార్థి విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించేవిధంగా ఉంటాయి. రెండూ లేక మూడు పాఠ్యాంశాలను కలిపి ఒక ప్రశ్నగా తయారుచేస్తారు. ప్రతిభావంతులైన విద్యార్థులే సమాధానం రాయగలరు. నెగటివ్ మార్కింగ్ కూడా ఉంటుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు ఇది చాలా అవసరం. ప్రమాణాల స్థాయిని పెంచకుండా కేవలం ప్రశ్నల సంఖ్యను తగ్గించడం వల్ల విద్యార్థులకు ఒరిగేదేమీ లేదు.